రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





## శంషాబాద్ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం



**శంషాబాద్, ఆగస్టు13, ప్రభాతవార్త :** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆటోనగర్‌లోని ఓ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాం నుంచి భారీగా పొగలు, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ ఇంజిన్లు ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేంచారు. గోదాంలో మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఆస్తి నష్టంపై అంచనా వేస్తున్నారు.

## ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిందే

### సర్పంచ్‌లను అవమానిస్తే సహించేది లేదు- అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

**పెద్దేముల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** గ్రామ ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులు ప్రజాప్రతినిధులని, వారితో అధికారులు అమర్యాదగా వ్యవహరించడం ఎంత మాత్రం సమంజసం కాదని ఎమ్మెల్యే తీవ్రంగా హెచ్చరించారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతువేదికలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశంలో అధికారులు తమ పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తు కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళగా ఆయన

>>2

## అలల హొయల మధ్య అందమైన క్షణాలు!



వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని సుప్రసిద్ధ కోట్‌పల్లి ప్రాజెక్ట్ జలకళ సంతరించుకుని కళకళలాడుతోంది.
ప్రకృతి రమణీయతకు నిలయమైన ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం అలుగు పారుతుండటంతో చూడచక్కని దృశ్యంగా మారి పర్యాటకులను, స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ప్రాజెక్ట్ నిండి జలాలు ఉప్పొంగుతుండటంతో ఆ ప్రాంతమంతా పచ్చని వాతావరణంతో అద్దంలా మెరుస్తోంది.
ఈ జలాధారం ద్వారా ధారూర్, పెద్దేముల్ మండలాల్లోని సుమారు 18 గ్రామాల రైతన్నల మోముల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి.
ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సాగునీరు సమృద్ధిగా అందనుండటంతో పంటలు కళకళలాడుతాయని, తమ కష్టాలు తీరుతాయని అన్నదాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

– ప్రభాతవార్త, ధారూర్

## గుండె గుండెనా తిరంగా కెరటాలు

వికారాబాద్ పట్టణ వీధులు త్రివర్ణ మయమయ్యాయి. హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బిజెపి నాయకులు 4 వేల మంది విద్యార్థులతో భారీ జాతీయ జెండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు యూ.రమేశ్‌కుమార్, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు హాజరయ్యారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలో దేశ భక్తి పెంపొందేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ను ఎగురవేయాలని సూచించారు. యువత దేశభక్తి భావాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్ రావు, కోకట్ మాధవ రెడ్డి, శివరాజ్, శంకర్ నాయక్, సాహు శ్రీలత, విజయ్ భాస్కర్ రెడ్డి, మారుతి కిరణ్, పాండు గౌడ్, శ్రీధర్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, గిరిమోని శ్రీను, పాల్గొన్నారు.

– ప్రభాతవార్త, వికారాబాద్





హెల్త్ సబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

## పల్లెలకూ దవాఖానా

### ఆసుపత్రుల నిర్మాణంతో పాటు ఆధునిక పరికరాలు

### డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ధారూర్, ఆగస్టు 13,ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు.గురువారం ధారూర్ మండలం కుక్కింద గ్రామంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని, అలాగే ఆవుసు పల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వికారాబాద్ నియోజకవర్గానికి భారీ ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. పట్టణాల్లో బస్తీ దవాఖానాల మాదిరిగానే, గ్రామాల్లో పల్లె దవాఖానాలను ఏర్పాటు చేస్తూ వైద్య రంగాన్ని పటిష్టం చేస్తున్నామని, ఆసుపత్రుల నిర్మాణంతో పాటు ఆధునిక పరికరాల కొనుగోలుకు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పోస్టుల భర్తీకి నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు.
గత పదేళ్లలో రోడ్లకు ఎలాంటి నిధులు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని స్పీకర్ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ.600 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఇప్పటికే రూ.480 కోట్లు మంజూరు కాగా, తాజాగా మరో రూ.53 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ నిధులతో రానున్న రెండేళ్లలో నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నింటినీ పూర్తిగా నూతనంగా నిర్మించి బాగు చేస్తామని హామీ ఇచ్చారు.
మన ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రాణహితచేవెళ్ల, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా ఎంతో కృషి చేశానని, ప్రాణహితచేవెళ్ల పథకంలో సుమారు రూ.1,500 కోట్ల పనులు కూడా జరిగాయని స్పీకర్ గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్వర్ణలత, జిల్లా వైద్య అధికారి సుధాకర్ లాల్, తహశీల్దార్ సాజిదా బేగం, డాక్టర్ శాంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుక్కింద రాములు, మాజీ పి ఏ సి ఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి,సర్పంచ్‌లు మన్నెమ్మ, మహేష్ కుమార్, ఎంపీఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బూట్ల పంపిణీకి తూట్లు!

### ప్రభుత్వ బడుల్లో ప్రహసనం..

- కొలతలు తీసుకోకుండానే సరఫరా
- 1 నుంచి 5వ తరగతి పిల్లలందరికీ ఒకటే సైజు
- మూలనపడుతున్న స్టాక్
- కాంట్రాక్టర్ల చేతివాటంతో విద్యార్థుల అవస్థలు
- చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రభుత్వ బడుల్లో మంచి సంకల్పంతో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసే కార్యక్రమానికి కాంట్రాక్టర్లు తూట్లు పెడుతున్నారు. కాలి సైజులకు ఉచిత బూట్లు లూజు లూజుగా మారి విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఒకటి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు ఒకే రకమైన సైజు బూట్లు పంపిణీ చేశారు. వారికి 3వ నెంబర్ సైజు బూట్లు ఇస్తున్నారు. ఇవి చిన్న పిల్లలకు సౌకర్యంగా ఉండటం లేదు. పదేండ్ల వయసు గల ఐదవ తరగతి విద్యార్థుకు మాత్రమే సౌకర్యంగా ఉంటాయి. ఐదేండ్ల నుంచి 9 ఏళ్ల వయసు గల విద్యార్థులకు అసౌకర్యంగా మారడంతో తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. వారం రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లో బూట్లు, యూనిఫారాలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులందరికీ ఒకే సైజు బూట్లు అందజేస్తున్నారు. పంపిణీ బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించినట్లు సమాచారం. 3వ నెంబర్ సైజు బూట్లు అసౌకర్యంగా మారడంతో పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేకపోతున్నారు. చాలా స్కూళ్లలో బూట్ల డబ్బాల స్టాకు స్కూలు ఆఫీసు గదుల్లో భద్రపరిచారు. జిల్లాలో 1,006 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు ఉన్నాయి. అందులో 62,195 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో 830 ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలల్లో 35,411 మంది విద్యార్థులు ఉన్నారు. ఉన్నత పాఠశాలల్లో కూడా 8వ తరగతి వరకు బూట్లు పంపిణీ చేస్తున్నారు. ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు 1,2,3,4 నెంబర్ సైజుల బూట్లు అందజేయాలని అధికారులు చెబుతున్నారు. హైస్కూలు, ఇంటర్ విద్యార్థులకు యుకే సైజ్ పంపిణీ చేయాలని అంటున్నారు. స్కూళ్ల పునఃప్రారంభించి దాదాపు రెండు నెలల తర్వాత ఉచిత పంపిణీ కార్యక్రమం చేపడుతూన్నరు. వాస్తవానికి విద్యార్థుల సైజులు తీసుకున్న తర్వాతనే బూట్లు తయారీ చేసి పంపిణీ చేయాలి. అందుకు విరుద్ధంగా పంపిణి చేయడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని అంటున్నారు. ప్రాథమిక దశ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న బూట్లలోనే ఎక్కువగా సైజుల తేడా ఉంటున్నాయి. విద్యాశాఖ అధికారులు స్పందించి తగిన సైజుల బూట్లను పంపిణీ చేయించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పసి పాదాలకు లూజు బూట్లు!

### పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తెచ్చాం : డీఈవో

బూట్ల పంపిణీ లోపాలపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తెచ్చామని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ తెలిపారు. జిల్లాలోని దాదాపు అన్ని పాఠశాలల్లో ఈ సమస్య వచ్చిందని చెప్పారు.
ఉన్నతాధికారుల ఆదేశాల వచ్చిన తర్వాత ఇది వరకు పంపిణీ చేసిన అసౌకర్యంగా ఉన్న బూట్లను వాపసు పంపిస్తామన్నారు.



కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల (టవర్స్) భూమి పూజలో పాల్గొన్న సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

## రుణం తీర్చుకుంటా

### నన్ను గల్లీ నుంచి ఢిల్లీకి పంపిన ఘనత మీదే

### కూకట్‌పల్లి నియోజకవర్గానికి సిఎం భరోసా

### అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి శ్రీధర్‌బాబుకు ఆదేశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల (టవర్స్) నిర్మాణంకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. గురువారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల (టవర్స్) నిర్మాణం కోసం సిఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ మంజూరు చేసి ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ (జి+10 అంతస్థుల టవర్స్) నిర్మాణంకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగరంలోని పలు ప్రాంతాల్లో, అదే విధంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నిర్మాణం చేపట్టటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణంలోని పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మీ సొంతింటి కలను నెరవేర్చటానికి నిజం చేయటానికి మీ సోదరునిగా ఇందిరమ్మ ఇండ్లను టవర్స్ (రూపం)లో అందించామన్నారు. మేడ్చల్ జిల్లాలోని మల్కాజ్‌గిరి ఎంపిగా నన్ను ఆదరించారు..గెలిపించారు..గల్లీ నుంచి ఢిల్లీకి నన్ను పంపారని కూకట్‌పల్లి నియోజకవర్గానికి ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానని, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటంలో ప్రత్యేక దృష్టి సారించాలని సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబును ఆదేశించారు. ప్రజలు అండగా ఉండాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, ప్రభుత్వ చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కమ్మ చైర్మన్ బండి రమేశ్, డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, పలువురు సంబంధిత ఉన్నతాధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణలు కాదు ఆధారాలు చూపండి..

### ప్లాట్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత

### బిఆర్ఎస్ ఆరోపణలు అన్నీ అసత్యాలే

### కాంగ్రెస్ నేత నరసింహారెడ్డి

**దుద్యాల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** కొడంగల్ అభివృద్ధి కోసం చేపట్టిన భూసేకరణలో రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చామని, పరిహారం విషయంలో న్యాయం చేశామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి స్పష్టం చేశారు. భూసేకరణ, పరిహారం, హకీంపేట్ ప్లాట్ల కేటాయింపుపై బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, కేటీఆర్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు. ఆరోపణలకు ఆధారాలు ఉంటే బయట పెట్టాలని, తాము మాత్రం సంబంధిత పత్రాలు, లబ్ధిదారుల జాబితాలు, లక్కీ డ్రా వివరాలను మీడియా ముందుంచామని తెలిపారు. హకీంపేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నరసింహారెడ్డి మాట్లాడుతూ, రైతుల నుంచి భూములు తీసుకుని వారికి న్యాయమైన పరిహారం ఇవ్వకుండా అభివృద్ధి చేయడం మా విధానం కాదు. భూసేకరణ ప్రక్రియలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పరిహారం అందించాం. అయినా అక్రమాలు జరిగాయని ఆరోపించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే అని అన్నారు. కొడంగల్ ప్రాంతంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం అందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

## కోరమ్ లేకపోయినా!

### మమ అనిపించారు

### 14 మందికి ఐదుగురే హాజరు..

### నిధులు, అభివృద్ధిపై చర్చ నిల్

### మహేశ్వరం పంచాయతీ సర్వసభ్య సమావేశం తీరుపై విమర్శలు

**మహేశ్వరం, ఆగస్టు 13,ప్రభాతవార్త :** మహేశ్వరం గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మారాల్సింది పోయి తూతూ మంత్రంగా ముగిసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం నిర్వహించిన ఈ సమావేశానికి మొత్తం 14 మంది సభ్యులకు గాను కేవలం ఐదుగురు మాత్రమే హాజరుకాగా, మిగతా తొమ్మిది మంది సభ్యులు గైర్హాజరయ్యారు. నిబంధనల ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఈ కీలక సమావేశంలో గ్రామాభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, వీధిదీపాలు మరియు చెత్త నిర్వహణ వంటి ప్రజాసమస్యలపై చర్చించాల్సి ఉంది. అయితే సభ్యుల హాజరు తక్కువగా ఉండటంతో ఎటువంటి సమగ్ర చర్చ జరగకుండానే సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గత సమావేశాల్లో చేసిన తీర్మానాల అమలు స్థితిగతులు, కొత్తగా చేపడుతున్న పనుల పురోగతి మరియు పంచాయతీకి మంజూరైన నిధుల వివరాలను సభ్యుల ముందుకు ఉంచకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సొంత నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కింద వచ్చిన నిధులను ఏ పనులకు ఎంత ఖర్చు చేశారనే దానిపై పారదర్శకత కరువైందని కొందరు సభ్యులు, స్థానికులు మండిపడుతున్నారు.
సర్వసభ్య సమావేశాలు కేవలం రికార్డుల్లో నమోదు చేసుకోవడానికి, మినిట్స్ బుక్‌లో సంతకాలు తీసుకోవడానికి మాత్రమే పరిమితమవుతున్నాయని, నిజమైన ప్రజా సమస్యలను పక్కనపెట్టి నివేదికలు అధికారులకు పంపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
ఎన్నికలు జరిగినప్పటి నుంచి నేటి వరకు నిర్వహించిన ఏ సర్వసభ్య సమావేశంలోనూ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరైన సందర్భాలు లేవని, ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యం వల్ల గ్రామాభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోనే అతి పెద్ద పంచాయతీలలో ఒకటిగా ఉన్న మహేశ్వరంలో పంచాయతీ పాలన తీరుపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. మండల, జిల్లా స్థాయి పంచాయతీ అధికారులు స్పందించి, సమావేశాలు నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని, నిధులు మరియు అభివృద్ధి పనుల వివరాలను బహిరంగంగా వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## గత సీజన్‌లో సమస్యలు పునరావృతం కావద్దు

### ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ కార్యాచరణ

### అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ఆదేశం



**రంగారెడ్డి అర్బన్, ఆగస్టు13, ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి గురువారం నిర్వహించిన కార్యాచరణ ప్రణాళిక సమావేశంలో అదనపు కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, సంబంధిత సంస్థల ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లపై సమగ్రంగా సమీక్షించారు. గత కొనుగోలు సీజన్‌లో ఎదురైన సమస్యలు, ఇబ్బందులను పరిశీలించి, అవి ఈ సీజన్‌లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు సుమారు 20,000 మెట్రిక్ టన్నుల ధాన్యంవచ్చే అవకాశం ఉందని అధికా రులు అంచనా వేశారు. ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి డీఆర్‌డీఓ, డీసీఓ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు సమావేశంలో వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది, తూకం యంత్రాలు,గన్నీ బ్యాగులు, తాగునీరు, షెడ్లు, విద్యుత్ సౌకర్యం, ధాన్యం తరలింపు వంటి అన్ని అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం నాణ్యత పరిశీలన,తూకం,కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## బొంతకుంట వాగు చెక్‌డ్యాం సర్వేపై మీనమేషాలు

### సరిహద్దుల ఏర్పాటులో బిల్డర్‌కు వంతపాట- అధికారుల తీరుపై గ్రామస్తుల ఆందోళన

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** బొంతగుంట వాగు బఫర్‌జోన్ స్థలం అక్రమణకు గురికాగా పకడ్బందీగా సర్వే నిర్వహించి హద్దురాళ్లు నాటడంలో జిల్లా సర్వే అధికారులతో పాటు ఇరిగేషన్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో వాగు అక్రమణకు రియల్ వ్యాపారస్తులకు అధికారులే వంతపాడుతున్నట్లు ఉంది. పోచారం డివిజన్ పరిధిలోని యంనంపేట్ బొంతకుంట వాగు చెక్‌డ్యాం అక్రమిస్తూ ఓ బిల్డర్ ఏకంగామట్టితో పూడ్చివేయగా స్థానికులు ఫిర్యాదు చేయగా పత్రికల్లో అప్పట్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించగా చర్యలు నామమాత్రం కావడంతో గ్రామస్తులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వాగును సందర్శించి చెక్‌డ్యాంతో పాటు వాగులో నింపిన మట్టిని తొలగించాలని బిల్డర్‌ను కోరారు. దీంతో బిల్డర్ మట్టిని తొలగించారు. కాగా చెక్‌డ్యాంతో పాటు వాగు బఫర్‌జోన్‌ను సర్వేచేసి హద్దురాళ్లు నాటించాల్సిన ఇరిగేషన్, సర్వే అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇటీవల జిల్లా సర్వే అధికారులు సర్వే హద్దురాళ్లు నాటించగా వాటిని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడంతో సమస్య మొదటికి వచ్చింది. కాగా గురువారం హైడ్రా అధికారులు సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో నాలుగు వాహనాల్లో సిబ్బందితో సంఘటన స్థలికి చేరుకున్నారు. జిల్లా సర్వేయర్‌తో పాటు ఇరిగేషన్ అధికారులను రప్పించి వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంతో పాటు దాదాపు మూడు కిలోమీటర్ల దూరం మేరకు గల బొంతకుంట వాగుకు బఫర్‌జోన్ సరిహద్దులు ఏర్పాటు చేయాలని రాగా జిల్లా సర్వేయర్ వెంకటయ్య తన సిబ్బందితో వచ్చి సర్వే హద్దురాళ్లను పరిశీలించగా గతంలో నాటిన హద్దురాళ్లు లేకపోవడంతో హద్దురాళ్లు నాటించకుండానే వెనుదిరిగారు. గతంలో నాటిన హద్దురాళ్లు ఎవరో మయం చేశారని వాటి ఆధారంగా హద్దురాళ్లు ఫిక్స్ చేయాలని చూసిన డిజిటల్ పరికరాలు లేకపోవడంతో సర్వే చేపట్టడం సాధ్యం కాకపోవడంతో మరోసారి సర్వేచేసి హద్దురాళ్లు నాటిస్తామని ఫిర్యాదుదారులకు తెలిపారు.
ఇదిగో అదిగో అంటూ హామీ ఇచ్చిన అధికారులు సర్వేచేయకుండానే వెను దిరుగడంతో బిల్డర్‌కు అనుకూలంగా వ్యవహారించేందుకే సర్వే చేపట్టడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు.
బొంతకుంట వాగుతో పాటు చెక్‌డ్యాం రక్షణకు సక్రమమైన చర్యలు తీసుకోకపోతే మరోసారి జిల్లా కలెక్టర్‌కు, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులతో పాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలిపారు. వాగు పరిశీలనకు వచ్చిన వారిలో హైడ్రా సీఐ రాజశేఖర్, జిల్లా సర్వేయర్ వెంకటయ్య, మున్సిపల్ ఇరిగేషన్ అధికారి మౌనిక, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా సిఐ రాజశేఖర్



ఆసుపత్రి భవనం పనుల వివరాలను పరిశీలిస్తున్న డిసిహెచ్ఎస్

## ఆసుపత్రి అభివృద్ధికి అదనంగా రూ.3 కోట్లతో ప్రతిపాదనలు

**ఆమనగల్లు, ఆగస్టు13, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో నిర్మాణం జరుపుకుంటున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన వసతుల కల్పన కొరకు అదనంగా 3 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డిసిహెచ్ఎస్ అనురాగిణిరెడ్డి అన్నారు. ఇప్పటికే రూ.17.50 కోట్ల నిధులతో ఆసుపత్రి భవనం, వైద్య పరికరాలకు వెచ్చిస్తుండగా, మార్చురి, కిచెన్ డైట్ హాల్, లిఫ్ట్ సౌకర్యాల కల్పన కొరకు అదనంగా మరో 3కోట్లు నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆమె వివరించారు. గురువారం ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు ఆసుపత్రి వైద్యాధికారి, సిబ్బందితో సమావేశమయ్యారు. హాజరుపట్టిక, రికార్డులను పరిశీలించారు. ప్రస్తుత సీజనలో నమోదైన రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒపితోపాటు విషజ్వరాలు, ఐపి, గర్భిణీ స్త్రీలు, కుక్కకాటు, పాముకాటు, కోతికాటు సంబంధించిన వ్యాక్సిన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి నూతన భవనంను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నాగరాజు, స్వాతి, ఊర్మిళ, అపర్ణ, చంద్రకృష్ణ, సిబ్బంది తిరుపతిరెడ్డి, డీఈ కోటయ్య, ఏఈ బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## అండర్ డ్రైనేజీ సిసి రోడ్లు మంజూరు చేయాలి

**తలకొండపల్లి ఆగస్టు 13, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రానికి అండర్ డ్రైనేజీ సిసి రోడ్ పనులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం నాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల లో అండర్ డ్రైనేజీ సిసి రోడ్ లేక ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని, వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవంచ నర్సింహారెడ్డి, పోతుగంటి గణేష్ మల్లేష్ శేఖర్ పురుషోత్తం వెంకటేష్ శ్రీశైలం తదితరులు ఉన్నారు.



ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్ తివారీ

## ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిపై కలెక్టర్ తనిఖీ

**దుద్యాల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** విద్యార్థులకు అత్యాధునిక విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో హకీంపేట్‌లో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులకు వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన హకీంపేట్‌లోని ప్రతి నిర్మాణ సైట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, మౌలిక వసతులపై సమీక్షించారు. డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, వెటర్నరీ కళాశాలలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను నిర్ణీత లక్ష్యాల మేరకు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనుల్లో పురోగతి ఉండాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి సైట్‌కు సంబంధించిన ప్లాన్‌లను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. అనంతరం కొడంగల్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసీల్దార్ కిషన్, ఈడబ్ల్యూఐడీసీ, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చుతో ఆలయాలకు విద్యుత్ వెలుగులు

### వార్డు సభ్యురాలు యాదమ్మకు స్థానికుల అభినందన

**యాచారం ఆగస్టు 13, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని తాడిపత్రి గ్రామంలో గల పోచమ్మ, పెద్దమ్మ ఆలయాలకు రెండో వార్డు సభ్యులు అనుమండ్ల యాదమ్మ గణేష్ విద్యుత్ సరఫరా కోసం కిలోమీటర్ మేర విద్యుత్ స్తంభాలు వైర్లు వేసి విద్యుత్ సరఫరాను అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు యాదమ్మ గణేష్ మాట్లాడుతూ.. తనవంతుగా ఆలయాలకు విద్యుత్ సరఫరా కోసం సుమారు 50 వేల ఖర్చుతో పనులు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని పేర్కొన్నారు. తను విద్యుత్ వృత్తిలో పనిచేస్తున్ననని అందుకు గ్రామంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలుంటే తను స్పందించి తనవంతుగా పరిష్కరిస్తానన్నారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆలయాలకు విద్యుత్ సరఫరా చేయలని ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు.



నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల కార్యవర్గ సభ్యులు

## మండల వార్డు సభ్యుల అధ్యక్షుడిగా తలారి ఎన్నిక

**యాచారం ఆగస్టు 13, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీలలో గల వార్డు సభ్యుల సంఘం సమైక్య కోసం గురువారం సాయి శరణం గార్డెన్‌లో సమావేశమై ఎన్నిక జరిపారు. తీవ్ర ఉత్కంఠం మధ్య లో మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తలారి సత్యనారాయణను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మహేష్ జగదీష్ ,సాయికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎస్ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా బొల్లంపల్లి వెంకటేష్ కాటిక శంకర్, ప్రధాన కార్యదర్శిగా వరలక్ష్మీ తులసి, మక్కపల్లి మహేష్, మారవని నవ్య, గౌరవ అధ్యక్షులుగా కొండాపురం సుష్మ శ్రీశైలం దశరథ అంజయ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొని అధ్యక్షున్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో విశ్వాసంతో వార్డు సభ్యుల అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యుల ఫోరం అభివృద్ధి కోసం సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

**అనారోగ్యంతో బాధపడుతున్న పెంట్యాకు రవీందర్ యాదవ్ పరామర్శ**

**షాద్‌నగర్, ఆగస్టు 13, ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండలం గిరాయిగుట్ట తండా గ్రామ పరిధిలోని నాగర్లగడ్డ తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నేనావత్ శ్రీను తండ్రి పెంట్యా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా పెంట్యా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. పెంట్యా త్వరగా కోలుకోవాలని రవీందర్ యాదవ్ ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో స్థానిక సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ గీత వీరేశం, మాజీ సర్పంచులు చంద్రశేఖర్, మచ్చేందర్, నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి, కంది యాదయ్య గౌడ్, కిషన్ నాయక్, రమేష్ నాయక్, హనుమంతు, ఫుల్యా, శ్రీధర్, శ్రీకాంత్, రాజు తదితరులు ఉన్నారు.

**భీమారం మాజీ సర్పంచ్ రాములు నాయక్‌కి పరామర్శ**

ఇటీవల ప్రమాదంలో గాయపడిన ఫరూఖ్‌నగర్ మండలం భీమారం మాజీ సర్పంచ్ రాములు నాయక్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ వారి స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు.

# దద్దరిల్లిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ

### మార్మోగిన వందేమాతర నినాదాలు!

**ఆమనగల్లు, ఆగస్టు13, ప్రభాతవార్త:** వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగ ర్యాలీ ఆమనగల్లులో దద్దరిల్లింది. జాతీయ పతాకాలు చేతబట్టి పురవీధుల గుండా చేపట్టిన ఊరేగింపు అందరిని ఆకట్టుకుంది. దేశ స్వాతంత్ర్య ఉద్యమం, అమరుల త్యాగాలు, నేటి దేశ ప్రగతి ఉన్నతికి స్ఫూర్తిగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు బిజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, యువతీయువకులు, బిజేపితోపాటు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. బిజేవైఎం మండల అధ్యక్షుడు గోరటి భరత్ అధ్యక్షతన స్థానిక హనుమాన్ దేవాలయం నుండి ప్రారంభమైన ఊరేగింపు పురవీధుల గుండా కొనసాగిస్తూ హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై కొనసాగించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు జాతీయ జెండాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అంతేకాకుండా నిర్వహకులు సమకూర్చిన భారీ జాతీయ జెండాను ఊరేగింపు నిర్వహించారు. ర్యాలీలో వందే మాతరం నినాదాలు దద్దరిల్లాయి. జాతీయ ఓబిసి కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారితోపాటు జిల్లా, తాలూకా, మండల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ర్యాలీ సందర్భంగా గాంధీచౌక్ వద్ద తల్లోజు ఆచారి ప్రసంగించారు. స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహనీయుల త్యాగాలను స్మరించుకునేందుకే ప్రధానమంత్రి నరేంద్రమోడీ హర్‌ఘర్ తిరంగ పిలుపునిచ్చినట్లు తెలిపారు. 150 వసంతాలు పూర్తి చేసుకుంటున్న వందేమాతరం గీతం ఎంతో ప్రత్యేకమైందని, ఈగీతం నాడు



భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

స్వాతంత్ర్య ఉద్యమంకు ప్రేరణగా నిలిచిందన్నారు. ఆంగ్లేయుల బానిస సంకేళ్ళ నుండి భారతదేశానికి ఎంతోమంది ప్రాణత్యాగాలు చేశారని, వారిని స్మరిస్తూ నేడు మనందరం జాతీయ పతాకం ఎగురవేసి వందనం సమర్పించాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశనుండే దేశభక్తిని పెంపొందించుకుని దేశ ప్రగతికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, గోరటి నర్సింహ్మా, చెక్కాల లక్ష్మణ్, రాంపాల్, దుర్గయ్య, బండెల రాంచంద్రారెడ్డి, రవిరాథోడ్, పార్లమెంట్ బీజేవైఎం ఇంచార్జీ పద్మఅనిల్, మండల అధ్యక్షుడు గోరటి భరత్, పద్మప్రశాంత్, లండన్ మల్లేశ్, మాజీ కౌన్సిలర్లు దుద్దు కృష్ణయాదవ్, చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్, కండెభాస్కర్, చుక్కా అల్లాజీగౌడ్ తదితరులు ఉన్నారు.

# రైతు పక్షపాతిగా రేవంత్ ప్రభుత్వ పాలన

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, ఆగస్టు13, ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ వ్యవసాయరంగ అభివృద్ధికి తోడ్పడుతున్నాడని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సుస్థిరమైన ప్రజారంజక పాలనలో అన్ని వర్గాల ప్రజలతోపాటు రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని ఆయన కొనియాడారు. మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన సబ్సిడీపై పురుగు మందులను రైతులకు అందజేశారు. గత జూలై నెలలో ప్రభుత్వం పత్తి విత్తనాలు అందజేసిన విషయం అందరికి తెలిసిందే. ఈమేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో ప్రభుత్వం ఆరుతడి పంటలను ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే హార్టికల్చర్ పంటలను ప్రోత్సహిస్తు రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. పత్తిసాగుతో లాభదాయకమైన దిగుబడులు పొందవచ్చని సూచించారు. ఆమనగల్లు మండలంలో కపాస్ కాంతి పథకం క్రింద జూలై మాసంలో పత్తి విత్తనాలు అందజేసినట్లు తెలిపారు. మండలంలో 80 హెక్టార్ ఈపథకం అమలవుతుందని చెప్పారు. పత్తి విత్తనాలు పొందిన రైతులకు 50శాతం సబ్సిడీతో పురుగుల మందులు కూడా అందిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయానికి ఇస్తున్న ప్రోత్సహంతో అన్నదాతలు సైతం ఎంతో ఉత్సాహంగా సాగు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. సబ్సిడీ యంత్రాలు, రైతుభరోసా, ఉచిత కరంటు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇస్తుందన్నారు.



పురుగుల మందు డబ్బాను సబ్సిడీపై అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కార్యక్రమంలో ఆమనగల్లు ఏడీఏ శోభారాణి, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, కోఆప్షన్ మెంబర్ ఖాదర్, నాయకులు యాట నర్సింహ్మా, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, రైతులు తదితరులు ఉన్నారు.

# బిసి మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ఆగస్టు 13, ప్రభాతవార్త :** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి, వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే ఆగస్టు 14న సాయంత్రం 4 గంటలకు హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఈ రెండు కార్యక్రమాల్లో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, వివిధ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి మహిళలకు ఉపాధికాంతులు



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

**షాద్‌నగర్, ఆగస్టు 13, ప్రభాతవార్త :** కుట్టు పనిలో ప్రావీణ్యత ఉన్న నిరుపేద బీసీ మహిళలను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం తాజాగా ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల ఉపాధి ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా బీసీ లో అర్హత ఉన్న మహిళల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు.

**షాద్‌నగర్ నియోజకవర్గానికి వెయ్యి కుట్టు మిషన్లు..**

ఇందులో భాగంగా షాద్ నగర్ నియోజకవర్గానికి వెయ్యి కుట్టు మిషన్లుమంజూరయ్యాయని తెలిపారు. వీటిని గ్రామానికి 10 చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కుట్టు పనిలో శిక్షణ పొందిన మహిళలు, కుట్టు పని తెలిసి ఉండి కుట్టు మిషన్ లేని నిరుపేద మహిళలు, టైలరింగ్ వృత్తిలో కొనసాగుతున్న మహిళలకు వీటిని అందజేయనున్నట్లు తెలిపారు. అయితే బీసీ మహిళలకు మాత్రమే వీటిని అందజేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే దరఖాస్తుల ప్రక్రియ ఆన్లైన్ ద్వారా పూర్తి చేయాలని వివరించారు. సెప్టెంబర్ 15 లోపు తమ దరఖాస్తులను అందజేయాలని వివరించారు. ప్రజలకు నిజాయితీతో కూడిన లబ్ధిని అందజేయగలిగేది ఒక కాంగ్రెస్ పార్టీ అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మహిళల సంక్షేమం కోసం తీసుకువచ్చిన పథకాలలో ఇది కూడా భాగమని ఆయన స్పష్టం చేశారు.

**రాజధానికి తరలి రండి..**

సంఘసంస్కర్తగా దేశాన్ని మార్చేందుకు కృషిచేసి సబ్బండ వర్గాలలో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడు జ్యోతిరావు పూలే, ఆయన మార్గంలోనే నడిచిన ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే విగ్రహాల ఆవిష్కరణ రాజధానిలో రేపు సాయంత్రం నాలుగు గంటలకు జరగనుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. నియోజకవర్గ నలుమూలల నుంచి ఈ కార్యక్రమానికి పూలే అభిమానులు, బీసీ సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఆవిష్కరించే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బిసి మంత్రులు, బీసీ ఎమ్మెల్యేలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరు కానున్నట్లు వివరించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం, బాలరాజు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, మండలాల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## శివాలయం భూమిని సర్వే చేసి రక్షించండి

**ఘట్‌కేసర్, ఆగష్టు 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి ఆలయ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడేందుకు సర్వే చేసి విచారణ జరపాలని ఆలయ ధర్మకర్త కంట్లం గౌరీశంకర్ కోరారు. ఈమేరకు గురువారం ఆయన ఘట్‌కేసర్ తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్‌ను కలిసి ఆలయ భూమిని సర్వే చేయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన ఆలయభూమి ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యలను వివరించారు. ఎదులాబాద్‌లో భ్రమరాంభికా మల్లిఖార్జునస్వామి ఆలయానికి సంబంధించి సర్వేనంబర్ 971లో 2-31 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఆలయానికి తూర్పు వైపున 300 గజాల స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్రహారిగోడ నిర్మాణం చేశారని ఆలయ భూమికబ్జా చేస్తున్నారని గతంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు, పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారులు ఆలయపక్కన గోడ నిర్మాణం చేస్తుండటంతో ఆలయానికి ఉత్తర ప్రవేశ ద్వారం లేకుండా పోతుందని భక్తులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు లేక పోవడంతో సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరని గౌరీశంకర్ పేర్కొన్నారు.

## రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య

ఘట్‌కేసర్, ఆగష్టు 13, ప్రభాతవార్త: కుటుంబ తగాదాలతో తీవ్ర మనస్థాపం చెంది ఓవృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ మధ్య గురువారం మధ్యాహం 2:30 గంటల కంటే ముందు ఓవ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ డివై/ఎస్ఎస్ సమాచారం రావడంతో జిఆర్‌పి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడు ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్‌కు చెందిన కూలీ పని చేసే ముద్దం రాములు (62)గా గుర్తించారు. మృతుని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు చేరుకొని బోరున విలపించారు. విచారణ జరుపగా రాములు భార్య, చిన్నకూతురు మధ్య గొడవలు జరుగుతుండటం, కుటుంబసమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది రాములు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



చిన్నారులకు యూనిఫారాలను అందజేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి మల్లేశ్, ఉప సర్పంచ్ విజయ్‌రాథోడ్

## మేడిగడ్డ తండాలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు

**ఆమనగల్లు, ఆగస్టు13, ప్రభాతవార్త:** అమనగల్లు మండలంలోని మేడిగడ్డ తాండ గ్రామ పంచాయతీలో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టారు. నీటి సరఫరాకు అవసర నిమిత్తం నూతనంగా బోరుబావిని త్రవ్వించారు. పుష్కలంగా నీటి వనరులు లభ్యం కావడంతో సర్పంచి రాజేశ్వరి మల్లేశ్, ఉప సర్పంచ్ విజయ్‌రాథోడ్‌తో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు సర్పంచు, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ రాజేశ్వరిమల్లేశ్, ఉపసర్పంచ్ విజయ్‌రాథోడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్‌డిఎఫ్ నిధులు రూ. 5 లక్షలు వెచ్చించి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రానున్న రోజులలో ప్రజలకు తాగునీటి సమస్య తల్లెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన యూనిఫారాలను విద్యార్థులకు అందజేశారు. ఈ మేరకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు మెంబర్లు మల్లేష్.సీతారాం. దేవేందర్. తావుర్య. కవిత మణిపాల్.సితి భాస్కర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న. ఉపాధ్యాయులు సంతోషి. సరితా తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలపూర్‌ను అదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**కుల్కచర్ల, ఆగస్టు 13 ప్రభాతవార్త:** తిరుమలపూర్ గ్రామాన్ని అదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తిరుమలపూర్ గ్రామంలో తన సొంత నిధులతో రూ.12 లక్ష్యలతో సర్పంచ్ మాధవి, స్థానిక నాయకులతో కలిసి సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్బిఓఎల్ ఎండి బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ముఖ్య లక్ష్యమన్ని స్పష్టం చేశారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం మరియు ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పెర్కొన్నారు .గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజిల నిర్మాణం వేగవంగా పూర్తి చేస్తునట్లు తెలిపారు.ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివకుమార్, గ్రామ సినియర్ నాయకులు నర్సింలు గౌడ్, శివయ్య గౌడ్, రాంమచంద్రయ్య, ఉమ శంకర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలపై అవగాహన కల్పించడం అభినందనీయం

**పూడూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త :** విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించడం అభినందనీయమని సర్పంచ్ శివశంకర్ అన్నారు. గురువారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మక్‌పోలింగ్ నిర్వహించిన అనంతరం పాఠశాల ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఎన్నికలవల్ల విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెపొందించే అవకాశం ఉందని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు సాంస్కృతిక, ఆటల పోటీల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యను అభ్యసించే పిల్లలకు నాణ్యతగల్ల విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, షూ, ఏకరూపదుస్తులు, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మాక్ పోలింగ్‌లో గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలియజేసిన ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ లక్ష్మీ, మిట్టకంకల్ గ్రామ ఉప సర్పంచ్ బందయ్య, ఉపాధ్యాయులు, నవీన్ కుమార్, రాంచెంద్రయ్య, సువానయ్య, షఫి, జ్ఞానేశ్వరి, స్వాతి, నాయకులు పోచయ్య, చిన్నబందయ్య, వెంకట్‌కుమార్‌గౌడ్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దుస్తులు పంపిణీ

**తలకొండపల్లి ఆగస్టు 13, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురు వారం నాడు గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరైనారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా స్కూల్ దుస్తులు, టై బెల్టు షూ అందజేస్తున్నామని విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె కోరారు. ప్రభుత్వం విద్య కోసం అధిక నిధులు కేటాయించి విద్యార్థులకు కావలసిన అన్ని ఒకరియాలు ప్రభుత్వం కల్పిస్తుందని ఆమె అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ఆమె తెలిపారు. అందరం విద్యార్థులకు దుస్తులు, టై ,బెల్టు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డోకూరు సునీత ప్రభాకర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ఉపసర్పంచ్ వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులున్నారు.

## ఇంటి నిర్మాణానికి సీకులు, సిమెంటు పంపిణీ

**తలకొండపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమాల నారాయణ అనే వ్యక్తి ఇంటి నిర్మాణానికి గురువారం నాడు ఉప్పల ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంటు, సీకులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కటికల శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో లబ్ధిదారునికి ఉప్పల వెంకటేష్ సహకారంతో ఉప్పల ట్రస్ట్ నుంచి అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు ఉప్పల ట్రస్ట్ ఎంతో సహకరిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్ మాజీ సర్పంచ్ లలిత జ్యోత య, ఉప సర్పంచ్ లోకం కోటేశ్వర్, లక్ష్మీ మ్రకాంత్ గౌడ్ జంగయ్య మల్లేష్ జంగయ్య తదితరులున్నారు.

## ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్‌లను అగౌరవపరిచే అధికారం ఏ అధికారికి లేదని అన్నారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగిస్తే చూస్తు ఊరుకోబోమని హెచ్చరించారు. అధికారులది ఉద్యోగ బాధ్యత అయితే, సర్పంచ్‌లది ప్రజలకు ఇచ్చిన సేవా బాధ్యత అని, ఇద్దరు పరస్పరం గౌరవించుకోవాలని సూచించారు. ప్రస్తుత సమావేశంలో విన్నవించిన సమస్యలను మళ్ళీ నిర్వహించే సమావేశం వరకు దాదాపు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల్లో ప్రతినిత్యం కరెంటు సరఫరా సక్రమంగా ఉండటం లేదని, పోన్లు చేసిన అధికారులు స్పందించడంలేదని, అంతేగాకుండా మిషన్ భగిరథ నీరు ఐదు రోజుల కోసారి సరఫరా అవుతుందని, పలుమార్లు పోన్లు చేసిన సంబందిత అధికారులు స్పందించడంలేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళగా, ప్రజాప్రతినిధులు విన్నవించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపి వారికి జవాబుదారిగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్**

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి కలెక్టర్ హజరై మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్ళాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్, షాదిముబారక్ తదితర సంక్షేమ పథకాల ఫలితాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి 45 రోజుల కోసారి నిర్వహించే సమీక్ష సమావేశంలో ప్రస్తుత సమావేశంలో విన్నవించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని అన్నారు. ప్రజాప్రతినిధులు విన్నవించిన సమస్యల పట్ల సంబందిత అధికారులు పరిష్కరించేందుకు కృషిచేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సుధీర్‌బాబు, మండల ప్రత్యేక అధికారి జయపాల్‌రెడ్డి, తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, యంపిడిఓ తిరుమలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో జిల్లా యువతకు అన్యాయం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చేపడుతున్న పోలీస్ రిక్రూట్‌మెంట్ విషయంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా యువతకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని, సిఎంకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లానే రాజకీయ బిక్షపెట్టిందని, సిఎంగా రాణించా రని, జిల్లా యువతకు అవకాశం కల్పించాలని లేకుంటే బిజెపి ఆధ్వర్యంలో యువత పక్షాణ పోరాటం చేస్తామని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్‌రెడ్డి హెచ్చరిం చారు. గురువారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమలరెడ్డితో కలిసి విలేకరులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లాల తిరుమలరెడ్డిలు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టటానికి నోటిఫికేషన్ జారీ చేశారని, దీనిలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, హైదరాబాద్, యాదాద్రి,భువనగిరి జిల్లాలు లేవని దీంతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన యువత తీవ్ర నిరుత్సాహంతో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం 7,112పోస్టుల భర్తీకి పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు (ఖాళీల భర్తీకి) నోటిఫికేషన్ ఇచ్చారని దీనిలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఏక పోవటంతో అన్ని జిల్లాల వారికి అవకాశం కల్పించి , మేడ్చల్ జిల్లాకు చెందిన యువతకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. ఎంతో మంది నిరుద్యోగులు ఏళ్ల తరబడిగా ఉద్యోగాల ఆశలతో కోచింగ్ సెంటర్లకు వెళ్లి డబ్బులు ఖర్చు పెట్టి చదువుకుంటున్నారని ఎందుకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాను చేర్చ లేదని వారు ప్రభుత్వాన్ని నిలదీశారు. మరీ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు ఎపుడు అవకాశం ఇస్తారని ఈ జిల్లా పరిధిలో, హైద్రాబాద్‌లోనూ ఖాళీలు భర్తీ చేస్తారని, నియామకాల నోటిఫికేషన్ నిబంధనల మేరకు పోటీల్లో పాల్గొంటే ఈ జిల్లా వారు నాల్‌లోకల్‌గా పరిగణిస్తారని దీంతో ఎంతో మంది యువకులు బాధపడుతున్నారని అన్నారు. తెలంగాణ సాధనలో నిధులు, నీరు, నియామకాలు లక్ష్యం సాధనలో ప్రత్యేక రాష్ట్రంను సాధించుకున్నట్లు తెలంగాణ వచ్చాక కొన్ని జిల్లాలకు ఉద్యోగ నియా మకాల్లో అవకాశం కల్పించి మిగతా మూడు జిల్లాలకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని వారు అన్నారు. హైద్రాలో డ్రైవర్ పోస్టులకు కూడ ఉన్నత విద్యను అభ్యసించిన వారు కూడ ఇంటర్వ్యూలకు భారీ సంఖ్యలో నిరుద్యోగులు హాజరు అయినట్లు, ఉద్యోగాల అన్వేషణలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నారని, యువతకు అన్యాయం చేస్తే సహించేది లేద న్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్, జిహెచ్‌ఎంసి మున్సి పల్స్‌తో కలిపి ఉందని పోలీస్ శాఖలో ఖాళీలను తెలుపాలని, నియ మకాలకు ప్రభుత్వం స్పందించి వెంటనే పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫి కేషన్‌లో సవరణలు చేసి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాను కూడ నియా మకాల కోసం చేర్చాలని ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లాల తిరుమలరెడ్డిలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే మాత్రం న్యాయపరంగా పోరాడుతామని, యువత పక్షాన బిజెపి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని వారు స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పార్టీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమలరెడ్డి

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## విద్యార్థులకు సకల సైకర్యాలు : సర్పంచ్ శ్రీనివాస్

**మోమిన్ పేట్, ఆగస్టు 13 , ప్రభాతవార్త:** ప్రైవేటు పాటశాలలకు ధీటుగా ప్రభుత్వ పాటశాల విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికెదిగి ఇతరులకు ఆధర్శం కావాలని గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని వెల్చాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యా ర్థులకు ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులు, ఒక జత షూస్, టై, బెల్ట్ లను స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు నేటి పోటీ ప్రపంచంలో అత్యాధునిక పరిజ్ఞానం ద్వారా అను భవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాభోదన జరుగుతున్న తరుణంలో ప్రభుత్వ పాటశాలల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం చదువుల కొరకు ప్రత్యేక చొరవ తీసుకొని విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించి వారి భవిష్యత్తుకొరకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాటశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కొరకు తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు.

ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాటశాల కమిటీ చైర్మన్, సిసి చెంద్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, అరుణ్ కుమార్, సంగమేశ్వర్, సునిత, నర్సమ్మ, భారతి, పుష్పలత, సీఆర్పీ బిచ్చయ్య, వీఓఏలు లక్ష్మి, శహనాజ్ సుల్తానా విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు,టై, బెల్ట్,షూస్ లు పంపిణిచేస్తున్న సర్పంచ్, తదితరులు.

## కొత్తచెరువు అభివృద్ధి పనులకు అధికారుల పరిశీలన

**రూ.74 లక్షల ప్రత్యేక నిధులతో పనులు**

**దుద్యాల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొత్తచెరువు అభివృద్ధి పనులను ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఈవో సత్యనారాయణరెడ్డి, ఈఈ అశోక్‌కుమార్, డీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్ చెరువు కట్ట, తూము, కాలువలు తదితర ప్రాంతాలను పరిశీలించారు. కొత్తచెరువు కట్ట, తూము మరమ్మతులతో పాటు కొత్తచెరువు నుంచి మల్రెడ్డికుంట వరకు సీసీ నిర్మాణం, సైడ్‌వాల్స్, కాలువల నిర్మాణం, షీల్ట్ తొలగింపు పనులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులకు రూ.74 లక్షల ప్రత్యేక నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. పనులు పూర్తయితే నీటి పారుదల వ్యవస్థ మెరుగుపడి ఆయకట్టు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సాగాయిపల్లి సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కుదురుమల్ల సర్పంచ్ లాలప్ప, నందారం సర్పంచ్ రాజగోపాల్, సంగాయిపల్లి ఉపసర్పంచ్ జగదీష్‌నాయక్, ఆయకట్టు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# గోదా సమేత మన్నారు రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు

**ఘట్‌కేసర్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నారు రంగనాయక స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్స వాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఈనెల 13 నుండి 19 వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని వంశపారంపర్య ధర్మకర్తలు తెలిపారు. ఉత్తర శ్రీవిల్లిపుత్తూరుగా ప్రసిద్ధి చెందిన ఈగరుడాద్రిక్షేత్రంలో వారం పాటు జరిగే ఈబ్రహ్మోత్స వాలకు భక్తులు విచ్చేసి స్వామి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. బుధవారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయగా గురు వారం వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ధ్వజారోహణం జరిపి భక్తులకు గరుడ ప్రసాదం అందించారు. సాయంత్రం దేవతాహ్వానంతో ఉత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈనెల 14న శేష వాహన సేవ, ఆండాళ్ తిరునక్షత్రం,హనుమంత వాహన సేవ, 15న అశ్వ వాహనసేవ, గజ వాహనసేవ, 16న ఆదివారం ఉదయం 11 గంటలకు గోదారంగ నాయస్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు గరుడ సేవ, 17న సాయంత్రం 6 గంటలకు స్వామి దివ్యవిమాన రథోత్సవం, 18 న మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం, గంధోలి ఉత్సవం, చక్రతీర్థం, సాంస్కృతిక కార్యక్రమాలు, 19న స్వామి వారి తిరుమంజనం ఘటాభిషేకం, మహాదాశీర్వచనం తదితర పూజాది కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈమేరకు వంశపారంపర్య ధర్మకర్తలు తిరువడందం పొరెత్తి లక్ష్మణాచార్యులు, వెంకటాచార్యులు, పురుషోత్తమాచార్యులు, శేషాచార్యులు, వేణుగోపాలాచార్యులు, అనంతశేషాచార్యులు, పార్థసారథి చార్యులు, రఘునాధాచార్యులు, రాజగోపాలాచార్యులు ఆలయంలో నిత్య పూజా, భక్తి, సాంస్కృతి కార్యక్రమాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేశారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు

# విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ..

**దుద్యాల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** మండలంలోని చెట్టుపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మూడవత్ గోపాల్, హెచ్‌ఎం దిలీప్ కుమార్ విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రవంతి, ఉపసర్పంచ్ లక్ష్మీ ృబాయి, ఏడబ్ల్యూటీ మణికమ్మ, వార్డు సభ్యులు, ఏపీసీ చైర్మన్ ముత్యాలీబాయి, వీఓఏ రూప్ల నాయక్, హన్మీబాయి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న సర్పంచ్

# పిఎసిఎస్ చైర్మన్ పదవికి పోటాపోటీ

**-అధ్యక్ష పదవి ఎన్నికపై ప్రజాభిప్రాయ సేకరణ**

**-అధిషానందే తుది ఫైనల్**

**కొడంగల్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** కొడంగల్ మండలంలోని హస్నాబాద్ పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) చైర్మెన్ ఎన్నికపై కాంగ్రెస్ పార్టీ అదిష్టానం కసరత్తు ప్రారంబించింది.పీఏసీఎస్ చైర్మెన్ పదవి నామినేటెడ్ పద్ధతిలో నియమించనుండడంతో చైర్మెన్ పదవిపై పోటాపోటీ నెలకొంది.పీఏసీఎస్ చైర్మెన్ పదవికి పలువురు నాయకులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ మండల పార్టీ అద్యక్షులు సంజీవరెడ్డి అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్,మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్,మాజీ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బాల్‌రెడ్డి ముఖ్య అతిధులుగా హజరుకాగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు,నాయకులు,ఆశావహులు పెద్ద సంఖ్యలో హజరుకాగా వారి అభిప్రాయాలను సేకరించారు.సమావేశంలో ప్రధానంగా పీఏసీఎస్ చైర్మెన్ పదవి ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై చర్చించారు.పీఏసీఎస్ చైర్మెన్ పదవి తమకు దక్కాలని పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.అదే సమయంలో మరికొందరు నాయకులు వైస్‌చైర్మెన్,డైరెక్టర్ పదవులపై ఆసక్తి వ్యక్తం చేశారు.ఈ క్రమంలో సమావేశానికి హజరైన ప్రజాప్రతినిధులు,నాయకులు తమకు అనుకూలంగా ఉన్న ఆవావాహుల పేర్లను ప్రతిపాదించారు.ప్రస్తుతం కొనసాగుతున్న చైర్మెన్ కట్కం శివకుమార్‌కు మరో దఫా అవకాశం ఇవ్వాలని పలువురు నాయకులు పేర్కొన్నారు.అలాగే పట్టణనికి చెందిన మిఠాయి రాజుకు అవకాశం కల్పించాలని మాజీ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్‌రెడ్డి ప్రతిపాదించగా అన్నారంకు చెందిన దీపక్‌రెడ్డి,నాగారంకు చెందిన బసంత్‌రెడ్డి,హస్నాబాద్‌కు చెందిన మల్లేశం,కొడంగల్‌కు చెందిన జూనియర్ కృష్ణంరాజులతో పాటు మొత్తం 12 మంది ఆశావాహులు మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిషలు కృషి చేశామని తమకు అవకాశం కల్పించాలని కోరారు.సమావేశంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం చైర్మెన్ పదవి కోసం అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించడం జరిగిందని,ఆశావాహుల జాబితాను అధిష్టానానికి సమర్పిస్తామని,అధిష్టానందే తుది నిర్ణయమని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 13,(ప్రభాతవార్త):** వివిజిరామ్‌జి పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్లు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు వినోద్‌కుమార్, వేణుగోపాల్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టెక్నికల్

# పాఠశాల విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

**దోమ,ఆగస్టు 13, ప్రభాతవార్త:** విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని శివారెడ్డిపల్లి గ్రామ యువకులు అర్జున్‌రెడ్డి,జావిద్‌ఖాన్ అన్నారు.గురువారం నాడు గ్రామములోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు బ్యాగ్‌లను అందజేశారు.ఈ సందర్భముగ వారు మాట్లాడుతూ విద్యార్థిదశ ఎంతో కీలకమని క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చుని సూచించారు.పేద విద్యా ర్థులను చక్కగా చదువుకునేందుకు తమవంతు సహాయం చేసేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామములో చదివే విద్యార్థులు చక్కగా చదువుకుంటే పాఠశాలకు గ్రామానికి మంచి పేరు వస్తుందని అన్నారు.పాఠశాల ప్రధానోపా ధ్యాయులు నర్సిములు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు మరిన్ని వసతులు కల్పించేందుకు దాతలు ముందుకు రావాలని కోరుతూ బ్యాగ్‌లు అందించిన వారిని అభినందించారు.ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు గ్రామస్తులు ఘనపురంరాజు ,పెంటయ్య,మతిన్‌ఖాన్,బీమయ్య,కృష్ణయ్య,రామక్రిష్ణ చోటు పాల్గొన్నారు.



శివారెడ్డిపల్లిలో విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

## అందుబాటులోకి చేయూత 'నూతన ఫింఛన్ల' దరఖాస్తులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని అన్ని మీ-సేవా కేంద్రాల్లో ప్రజల సౌకర్యంకై చేయూత 'నూతన ఫించన్ల' కోసం ధరఖాస్తుల సేవలు అందుబాటులోకి వచ్చినట్లు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.శర్వన్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం నూతన ఫింఛన్లు కోసం ధరఖాస్తులు చేసుకోవటానికి ప్రభుత్వం మీ-సేవా ద్వారా అవకాశాలు కల్పించిందన్నారు. నూతన ఫింఛన్ మంజూరు కోసం అర్హులైన వారు దరఖాస్తుదారులు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకవచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని మీసేవా కేంద్రాల్లో ఫింఛన్ల ధరఖాస్తులకు సంబంధించి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఫించన్ పొందటానికి అర్హత కల్గిన ప్రజలు తమ సమీపంలోని మీ-సేవా కేంద్రాలను సందర్శించి నూతన ఫింఛన్ల కోసం ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. అవసరమైన వివరాలను నమోదు చేసి సంబంధిత పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని అన్నారు. ధరఖాస్తు సమర్పించిన తరువాత పూర్తి విజయవంతం జరిగాక ధరఖాస్తు ఐడి జారీ చేయబడుతుందన్నారు. ఈ ధరఖాస్తు ఐడి ద్వారా భవిషత్‌లో ధరఖాస్తు వివరాలను తెలుసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన వారు అర్హత కలిగిన ప్రజలు చేయూత నూతన ఫింఛన్లు కోసం ధరఖాస్తులు మీ సేవా ద్వారా చేసుకోవాలని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమశిక్షణ, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని జెఎన్‌టీయూహెచ్ యూసీఈఎస్‌టీ కంప్యూటర్ సైన్స్-ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సురేష్‌బాబు, సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ అభిషేక్ సింగంశెట్టి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లోని సంస్కృతి కళాశాలలో నూతనంగా చేరిన బీటెక్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ 21వ ఓరియంటేషన్ డే-ఇండక్షన్ ప్రోగ్రామ్-2026ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆగస్టు 13 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండక్షన్ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్ యూసీఈఎస్‌టీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె. సురేష్ బాబు ప్రారంభించారు. గౌరవ అతిథిగా సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ అభిషేక్ సింగంశెట్టి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జానకిరాములు పాల్గొని మాట్లాడారు. సురేశ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని కళాశాలలో లభించే అవకాశా లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్య అనేది కేవలం డిగ్రీని పొందేందుకు మాత్రమే కాదని, సమాజ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించగల నైపుణ్యాలను పెంపొందించుకునే ప్రయాణమని తెలిపారు.

# డివిజన్ స్థాయిలో కాంగ్రెస్‌ని బలోపేతం చేయండి

**ఘట్‌కేసర్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్‌రెడ్డిలు సూచించారు. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలోని బంధన్ పంక్షన్‌హాలులో గురువారం ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఏర్పాటు కోసం పేర్ల సేకరణ చేశారు. పార్టీ నూతన కార్యవర్గం కూర్పు, అనుబంధ కమిటీల ఎంపిక కోసం చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. సర్ ప్రక్రియను విజయవంతం చేసిన బిఎల్ఏలకు శాలువాలతో సన్మానం చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, మాజీ శాసన సభ్యులు సుధీర్‌రెడ్డిలు మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అనుబంధ సంఘాలకు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎంపిక చేయడం, ప్రతి విభాగంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడంపై నాయకులకు పలు సూచనలు చేశారు. అనుబంధ సంఘాల అధ్యక్షుల పేర్ల సేకరణ ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేసి, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలని వారు నాయకులకు సూచించారు. అనంతరం డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డిని శాలువా, పూలదండలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు చిల్కూరి మచ్చేందర్ రెడ్డి, కీసరగుట్ట డైరెక్టర్ సగ్గు అనిత శ్రీనివాస్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ మెడబోయిన వెంకటేశ్, మాజీ కౌన్సిలర్లు కడపోళ్ళ మల్లేశ్, కుతాడి రవీందర్, మాజీ వార్డు సభ్యులు కొంతం రాంరెడ్డి, గడీల సంజీవరెడ్డి, మామిండ్ల చిత్తారియాదవ్, కొరుబోతు నాగరాజు, రహీముద్దిన్, బర్ల దేవేందర్, వీబీ.వెంకట్ నారాయణ, మీసాల సుధాకర్ రావు, కొత్తకొండ వెంకటేశ్, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ మెరుగు నరేశ్, డీసీసీ మాజీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు మీసాల మల్లేశ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మేకల దాసు, మైనారిటీ సెల్ జిల్లా నాయకులు ఎం.ఎ.రహమాన్, బ్లాక్ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మేకల సునీల్ కుమార్, నాయకులు కేశవపట్నం అంజనేయులు, కందకట్ల మాధవరెడ్డి, లగ్గోని సురేశ, సిరాజుద్దిన్, అశ్రఫ్అలీ, అబ్దుల్‌ఖయ్యూమ్, బొక్క సత్తిరెడ్డి, బొక్క సుధాకర్‌రెడ్డి, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ మాజీ శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి

# హోరెత్తిన హర్ ఘర్ తిరంగార్యాలీ


తిరంగార్యాలీ పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్,ఇతర బిజెపి నేతలు

**కేశంపేటలో వీధులన్నీ తిరంగా శోభ**

**జాతీయ జెండాలతో మారుమోగిన మువ్వన్నెల నినాదాలు**

**కేశంపేట, ఆగస్టు 13, ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలో జాతీయ జెండాల ప్రదర్శనతో వీధులన్నీ తిరంగా శోభను సంతరించు కున్నాయి. భారీ ప్రజా భాగస్వామ్యం అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని దిగ్విజయం చేశారు.

**మిన్నంటిన నినాదాలు:**

భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో కేశంపేట పురవీధులు మారుమోగాయి.ఇంటింటికీ జాతీయ జెండా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను గౌరవప్రదంగా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కేశంపేట మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగ్గా కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిర్వహించిన భారీ జాతీయ జెండా ర్యాలీ అత్యంత కోలాహలంగా, దేశభక్తి పూరిత వాతావరణంలో సాగింది.ఈ ర్యాలీ మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగుతుండగా, చేతుల్లో మువ్వన్నెల జెండాలు పట్టుకుని విద్యార్థులు, యువకులు, అధికారులు చేసిన భారత్ మాతా కీ జై, వందేమాతరం నినాదాలతో కేశంపేట పరిసరాలు మారుమోగాయి.ఈ సందర్భంగా నాయ కులు, అధికారులు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడానికే ఈ హర్ ఘర్ తిరంగ్గా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి ఈ వేడుకను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హర్గర్ కేశంపేట మండల కన్వీనర్ కాండం ఉదయ్ కుమార్ గౌడ్ మండల కో కన్వీనర్ కంచుకోట మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు జాతీయ జెండాను చేత బూని అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్, రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కోశాధికారి అమడపురం నరసింహ గౌడ్, హర్గర్ తిరంగా షాద్ నగర్ ఇన్చార్జి వంశీకృష్ణ, మండల అధ్యక్షురాలు రోళ్ల రాధిక, హర్గర్ తిరంగా మండల ఇన్చార్జి మచ్చ సుధాకర్ రావు, షాద్ నగర్ ధార్మిక సెల్ కన్వీనర్ పసుల నరసింహ యాదవ్, బీజేవైఎం షాద్ నగర్ అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయికుమార్ ముదిరాజ్ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్నోజిగూడలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ అన్నోజిగూడలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు బీజేపీ నాయకులు నానావత్ బిక్కునాథ్ నాయక్, గొంగళ్ల బాలేశ్ కురుమ, డివిజన్ అధ్యక్షుడు సురేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అన్నోజిగూడ లోని పురవీధుల గుండా జాతీయ పతాకం చేతబూని భారత మాతకు జై అంటూ బీజేపీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యత, దేశభక్తి పెంపొందించడానికి ప్రధాని పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టినట్లు బీజేపీ శ్రేణులు తెలిపారు. ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో బీజేపీ మాజీ కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్ కురుమ, తౌర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.


అన్నోజిగూడలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు.

## నందిగామలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**నందిగామ, ఆగస్టు 13, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో బుధవారం మేరా యువ భారత్ రంగారెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా జెండా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించే లక్ష ్యంతో నిర్వహించిన ఈ ర్యాలీకి నందిగామలో అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము కృష్ణ మాట్లాడుతూ భారత స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరు స్వాతంత్ర దినోత్సవ స్ఫూర్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను గౌరవప్రదంగా ఎగురవేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ ఐక్యతను పెంపొందించడంలో నందిగామ ప్రజలు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్, మై భారత్ ప్రతినిధి దాసరి శ్రీశైలం యాదవ్, వార్డు సభ్యులు నరసింహ, అగ్గి సురేష్, బి. కృష్ణ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, జాగాయ, అగ్గి ప్రవీణ్, స్థానిక నాయకులు, యువకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



తాళ్లగూడలో ఐమాక్స్ లైట్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి.

### తాళ్లగూడెంలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసిన మాజీ ఎంపిపి

నందిగామ, ఆగస్టు 13, ప్రభాతవార్త : నందిగామ మండలం తాళ్లగూడ గ్రామంలో కొత్తూరు మండల మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి సొంత ఖర్చులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి ప్రారంభించారు. నవతరానికి నాయకుడవై.. యువతరానికి ఆదర్శ నిలిచి సేవలో వికసిస్తూ సమాజాభివృద్ధికి కంకణం కట్టుకున్న మధుసూదన్ రెడ్డిని గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు గౌడ్, ఉప సర్పంచ్ సి లక్ష్మయ్య, వార్డు సభ్యులు ప్రవీణ్ గౌడ్, శ్రీశైలం, పవన్, అనూష, విక్రాంత్, హరి చారి, నాగేష్ రాణి, బి సత్తయ్య, ఏ యాదయ్య, రాజేందర్ ,మల్లేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్ శ్రీకాంత్ వెంకటేష్ గౌడ్ ,కె ప్రవీణ్ ,నరసింహారెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ దశరథ, దామోదర్ రెడ్డి ,పాపిరెడ్డి, రాజేష్, జయేందర్ రెడ్డి ,చిర రాజు, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నాట్కో పరిశ్రమలో.. సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



నాట్కో ఫార్మాలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఎస్ హెచ్ ఓ వీరబాబు

**నందిగామ, ఆగస్టు 13, ప్రభాతవార్త :** నందిగామ మండలం మేకగూడ గ్రామంలో ఉన్న నాట్కో ఫార్మా పరిశ్రమ ఉద్యోగులకు గురువారం సైబర్ క్రైమ్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. నందిగామ ఎస్ హెచ్ ఓ వీరబాబు ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఫిషింగ్ లింకులు, మోసపూరిత కాల్స్, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ లు, పోలీస్ సిబ్బంది, నాట్కో ఫార్మా కంపెనీ ప్రతినిధి సాంబశివరావు, పరిశ్రమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు శ్రద్ధగా చదివి వృద్ధిలోకి రావాలి



**షాబాద్ :** విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య అన్నారు. బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా షాబాద్ మండలంలోని సంకేపల్లిగూడ ప్రభుత్వ పాఠశాలలో గ్రామ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్యతో కలిసి విద్యార్థులకు టీవీని ఏర్పాటు చేసి, మధ్యాహ్న భోజనం అందించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు దాతలు, గ్రామ పెద్దలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నేతలు

**కుల్కచర్ల, జూలై 13 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన బోధన జరుగుతుందని సర్పంచ్ మడుగు శ్రీనివాస్, సర్పంచ్ అన్నారు. గురువారం మండల పరిధిలోనిబండవెల్కిచర్ల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్థానిక నాయకులతో కలిసి ఏకరుప దుస్తులు పంపిణి చేశారు. కార్యక్రమంలో పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**పిరంపల్లి గ్రామంలో....**

మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో సర్పంచ్ గడ్డం వెంకటయ్య స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను భోదించడం, నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు. బడిఈడు వయస్సు కలిగిన వారిని బడిలో చేర్పించలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీలత జంగయ్య, గ్రామ నాయకులు జి. రమేష్, కె. శ్రీనివాస్, వెంకటయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ వహించాలి....**

**సర్పంచ్ సత్యమ్మ వెంకటేష్**

విద్యర్థుల చదవుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ద వహించాలని సర్పంచ్ సత్యమ్మ వెంకటేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కామునిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలోవిద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ఎల్లమ్మ, విఓఎ మల్లేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**రాంరెడ్డిపల్లి గ్రామంలో...**

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనం అందుతుందని సర్పంచ్ కోస్గి నరసింహులు యాదవ్ అన్నారు. గురువారం మండల

**పరిధిలోని రాంరెడ్డి పల్లి**

గ్రామంలో విద్యర్థులకు స్థానిక నాయకులతో కలిసి ఏకరుప దుస్తులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యయ్య గౌడ్, మహిళ సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**ఇప్పాయిపల్లి గ్రామంలో......**

ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, సర్పంచ్ మల్లేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇప్పాయిపల్లిగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎకరుప దుస్తువులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ బాల్‌రెడ్డి, సినియర్ నాయకులు నర్సింలు గౌడ్, గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాలాజీ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 13, ప్రభాత వార్త:** వెంకటాపూర్ గ్రామంలోని శ్రీ స్వయంభు శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ శ్రీకారం చుట్టారు. దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర కల్గిన పురాతన దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందకు తాను కట్టుబడి ఉన్నట్లు డివిజన్ అధ్యక్షుడు రాజేశ్ తెలిపారు. దేవాలయాన్ని గురువారం సందర్శించి పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు, గ్రామస్తులు, ప్రజలు తమవంతు సహాయ సహకారాలు అందించి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు. మన ఆలయం మన బాధ్యత అనే నినాదంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిద్దామని అన్నారు. ఆగస్టు 20 నుండి దేవాలయంలో ప్రారంభంకానున్న కుంభాషేక కార్యక్రమంపై ఆలయ ఈవో, పంతుళ్లతో చర్చించారు. చారిత్రక ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం నిరంతరం కృషి చేస్తామని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తెలిపారు. ఆలయ ఈవో లగడపాటి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులపై ఈవోను వివరాలు అడిగితెలుసుకుంటున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేశ్.

# ప్రజలకు మెరుగైన రోడ్లు, మౌలిక వసతులు కల్పించటానికి కృషి



తుర్కపల్లిలోని 1వ, 3వ వార్డులలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి శంకుస్థాపన చేయగా,పాల్గొన్న వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 13,ప్రభాతవార్త:** ప్రజలకు మెరుగైన రోడ్లు, మౌళిక వసతులు సౌకర్యాలు కల్పించటానికి కృషి చేస్తున్నట్లు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో 1వ, 3వ వార్డులలో మున్సిపల్ జనరల్ నిధులు రూ.8లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపల్‌లోని వివిధ వార్డుల్లో పలు అభివృద్ధి పనులు దశల వారీగ చేపట్టటం జరుగు తుందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు వైస్ చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్లు హపావత్ వెంకటేశ్, దాసరి రవి, హనుమాన్‌దాస్, గురకల దీప, ముద్దం సుదాకర్‌రెడ్డి, ఎల్లు దీపికవరప్రసాద్‌రెడ్డి, యూసుఫ్‌బాబా, మున్సిపల్ ఎఇఇ సనాషాహిన్, మున్సిపల్ సిబ్బంది, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**..గ్రామ ప్రజలకు మొక్కలు పంపిణీ..చైర్‌పర్సన్..**

వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించటానికి ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు, గ్రామ ప్రజలు వాటిని నాటి సంరక్షించాలని అలియాబాద్ మున్సిపల్ చైరపర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ ఎన్.వెంకటరెడ్డిలు కోరారు. గురువారం తుర్కపల్లి గ్రామంలో వనమహోత్సవం-2026లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించటానికి గ్రామ ప్రజలకు మొక్కలను వారు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని, ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని వారు సూచించారు. మొక్కలను నాటాదాం-పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్, పలువురు కౌన్సిలర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సిబ్బందికి ఈఎస్ఐ, పిఎఫ్ కార్డుల పంపిణీ



మూడుచింతలపల్లి మున్సిపల్ సిబ్బందికి ఈఎస్ఐ,పిఎఫ్ కార్డులను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్,పాల్గొన్న కౌన్సిలర్ గోవర్ధన్‌రెడ్డి, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 13, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మున్సిపల్ సిబ్బందికి ఈఎస్ఐ, పిఎఫ్ కార్డులను ఆ మున్సిపల్ చైర్మన్ జాము రవి పంపిణీ చేశారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ సిబ్బందికి, జవాన్లు, పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఈఎస్ఐ,పిఎఫ్ కార్డులను చైర్మన్ జాము రవి. కమిషనర్ వెంకటగోపాల్‌తో కలిసి వారికి పంపిణీ చేశారు. మున్సిపల్ సిబ్బంది విధి నిర్వాహణలో గ్రామాల్లో పారిశుద్యం అమలుకు విశేషంగా కృషి చేస్తున్నట్లు, వారి సంక్షేమం కోసం ఈఎస్ఐ, పిఎఫ్‌ల కార్డుల పంపిణీ చేస్తున్నందుకు సంతోషంగా ఉందని, హర్షం వ్యక్తం చేస్తూ సిబ్బంది సమస్యలను పరిష్కరించటానికి ముందు ఉంటానని చైర్మన్ జాము రవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్ గోవర్ధన్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ అర్షద్ అహ్మద్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



మూడుచింతలపల్లి మున్సిపల్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ చైర్మన్ జాము రవికి వినతిపత్రం అందజేసిన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్,ఎంప్లాయిస్ సిఐటియు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి ఉన్నికృష్ణన్, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 13, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మున్సిపల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు కూడ వెంటనే అందజేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ సిఐటియు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి ఉన్నికృష్ణన్‌లు మున్సిపల్ చైర్మన్ జాము రవిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జాము రవిని, కమిషనర్ వెంకటగోపాల్‌ను కలిసి వారు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ సిబ్బందికి ప్రతి నెల 1నుంచి 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, రెండు నెలలకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికుల బ్యాంకు ఖాతాల్లో సకాలంలో వేతనాలు జమ జరిగేలా చూడాలని వారు కోరారు. మున్సిపల్ సిబ్బందికి ఒక పూట పని ఇవ్వాలని, పండుగ సెలవులు, వారంతపు సెలవులు ఇవ్వాలని వారు విన్నవించారు. సకాలంలో వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్మికులకు న్యాయం చేయాలని, సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు యూనియన్ నాయకులు ప్రశాంత్, బాలేశ్, బిక్షపతి, రమేశ్‌తో పాటు పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



### భూసార పరిరక్షణతోనే స్థిరమైన వ్యవసాయం

**విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన**

**షాబాద్, :** నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ అధికారులు సూచించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై)లో భాగంగా షాబాద్ మండలంలోని పీఎం శ్రీ పాఠశాల, మోడల్ స్కూల్‌కు చెందిన 50 మంది విద్యార్థినీ, విద్యార్థులకు భూసార పరీక్షలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా భూసార పరీక్ష కేంద్రం, రాజేంద్రనగర్‌కు చెందిన వ్యవసాయ అధికారులు ఎ. సునీత, కె. రాజేష్ కుమార్లు కార్యక్రమానికి నాయకత్వం వహించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, నేల ఆరోగ్యం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, మాతృభూమి పరిరక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భూమిలోని పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్, కార్బన్ తదితర పోషకాల స్థాయితో పాటు నేల ఆమ్లత్వం (పి.హెచ్), ఎలక్ట్రికల్ కండక్టివిటీ (ఈసీ) వంటి అంశాలను భూసార పరీక్షల ద్వారా తెలుసుకునే విధానాన్ని అధికారులు ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు చూపించారు. నేలలో పెరుగుతున్న కాలుష్యం, భారీ లోహాల కాలుష్యాన్ని తగ్గించే చర్యలు, పంటలకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందించే విధానాలను వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా పంటల దిగుబడి, నాణ్యతను పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు. భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్ తరాల్లో వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, సైన్స్ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి బాబ్య నాయక్, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు రాఘవేందర్‌తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 13,(ప్రభాతవార్త):** విద్యార్థులు ఇష్టపడి చదివితే భవిషత్తులో ఉన్నత ఫలితాలు సాధిస్తారని చేగిరెడ్డి ఘనపూర్ గ్రామ సర్పంచ్ పావని అన్నారు. గురువారం స్వామీ వివేకానంద సేవ సమితి షాద్‌నగర్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ విద్యార్థులకు బ్యాగులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పావని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎస్వీ ఎస్ ఎస్ వారు బ్యాగులను అందిచడం సంతోషకారమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల భవిష్యత్ కోసం సహాయం చెయ్యడానికి ముందుంటామని స్వామీ వివేకానంద సేవ సమితి అధ్యక్షుడు సాయి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జాన్ బిల్ మోరియా, ఉప సర్పంచ్ నర్సిములు. వార్డు మెంబర్లు భీమయ్య, దిలీప్ రెడ్డి. మాజీ సర్పంచ్ శివ, ఉపాధ్యాయులు నరేష్, హైమావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న స్వామీ వివేకానంద సేవ సమితి సభ్యులు, ఉపాధ్యాయులు

### మాదకద్రవ్యాలపై అవగాహన

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 13,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం మాదకద్రవ్యాలపై ఎస్ఐ విజయ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అగాహిత్యాలపై వివరించారు. రోడ్డుపై వాహనాలు నడిపే విదానం, ట్రాఫిక్ నిబందనలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ముఖ్యంగ బాలికలు సమాజంలో ఎంతో జాగ్రత్తగ ఉండాలని ఏదైన సమస్య ఎదురైతే పోలీసులను అశ్రయించాలని పెర్కోన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి రాఘసుధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ విజయ్

### విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ



విద్యార్థులకు యూనిఫామ్‌లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 13,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం విద్యార్థులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. మండలంలోని వీరన్నపేట, జాకారం, పెద్ద ఎల్కిచర్ల గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యూపిఫామ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎపార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సిసి రమేష్, జంగయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రైతులుకి అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

### శాస్త్రీయ విధానంలో పంట సాగు చేయాలి

**వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్ కుమార్**

**తలకొండపల్లి, ఆగస్టు 13, ప్రభాతవార్త:** ప్రస్తుతం రైతులు తాము వేసుకునే పంటలను శాస్త్రీయ విధానంతో పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్ కుమార్ అన్నారు. గురువారం నాడు తలకొండపల్లి మండలంలో రైతువేదికలో నిర్వహించిన రైతులకు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు అధికారుల సూచనల సలహాల మేరకు పంటలు వేసుకోవాలన్నారు. పంటలో ప్రాధాన్యత కలిగిన సిఫారసు చేసిన పంటలను వేసుకోవాలని, హెచ్చి పత్తి సాగు వల్ల ప్రతికూల ప్రభావం ఎదురయ్యే అవకాశం ఉందని, వ్యవసాయం నానో ఎరువుల వినియోగం ఎక్కువగా వాడుకోవాలని ఆయన అన్నారు. తక్కువ నీటితో అంటే పంటలను పై దృష్టి పెట్టాలని తడి పంటలు నూనె గింజలు ఎక్కువగా వేసుకోవాలన్నారు. తులందరూ భూసార పరీక్షలు చేయించుకొని విశ్వదార ప్రాంతాల్లో సమగ్ర వ్యవసాయ విధానాన్ని పాటించాలని స్థానిక అవసరాలు మన రాష్ట్ర కనుగుణంగా అనుబంధ వ్యవసాయ కార్యక్రమాలు రైతుల సలహాలు సూచనలు నిర్వహించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త విజయకుమార్ మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, మాజీ ఎంపీపీసీఎల్ శ్రీనివాస్ యాదవ్, వెంకట్ రెడ్డి నూకంకోటేశ్వర్ తో పాటు ఏఈవోలు ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కేశంపేట, ఆగస్టు 13, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో గురువారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం కేశంపేట మండల పరిధిలోని బైర్కాన్ పల్లి గ్రామపంచాయతీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన నందిగామ జంగయ్య తన వ్యక్తిగత పనుల నిమిత్తం కొత్తపేట గ్రామానికి వెళ్లి తిరిగి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురు గా వస్తున్న ఓమిని వాహనం అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి జంగయ్య నడుస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో జంగయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న కేశంపేట సిఐ నరహరి పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు.



బైక్‌ను ఢీకొట్టిన ఓమిని వాహనం

### ఉపాధ్యాయుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

**-డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రాన్ని సమర్పించిన మండల అధ్యక్షురాలు జ్యోతి**



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూఎస్పిఎస్సి సంఘం

**కేశంపేట, ఆగస్టు 13, ప్రభాతవార్త :** యూఎస్పిఎస్సి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని గురువారం కేశంపేట డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రాన్ని సమర్పించినట్లు యూఎస్పిఎస్సి కేశంపేట మండల అధ్యక్షురాలు జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైప్రధాన డిమాండ్లుపెండింగ్‌లో ఉన్న డి ఎ లను వెంటనే విడుదల చేయాలి పి ఆర్ సి ను తక్షణమే అమలు చేయాలి జీవో ఎంఎస్ .25ను సవరించి ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం అమలు చేయాలిసీపీస్ ను రద్దు చేసి ఒపీస్ ను పునరుద్ధరించాలి2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఒపీస్ ను అమలు చేయాలి27,000 పాఠశాలలను 4,000కు విలీనం చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలితదుపరి జరిగే జిల్లా స్థాయి ధర్నా, రాష్ట్ర స్థాయి ధర్నాలకు కేశంపేట మండలం నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది తెలిపారు . అప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని చేపడతామని యూఎస్పిసి , టీఎస్ యు టిఎఫ్ స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూఎస్పిసి టీఎస్ యుటిఎఫ్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని మండల అధ్యక్షురాలు జ్యోతితెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ కేశంపేట జనరల్ సెక్రటరీ రామకృష్ణ, ఉపాధ్యక్షులు వినీత్ బాబు, కోశాధికారి చిన్నారావు, మండల కార్యదర్శులు రవికుమార్, విజయ్, అరుణ్, స్పోర్ట్స్ కన్వీనర్ రాజు, సీనియర్ నాయకురాలు రాజేశ్వర్ తో పాటు ఉపాధ్యాయులు అపర్ణ , శ్రీలత , స్వప్న , మోసెస్ , గోవర్ధన్ చారి ,తదితరులు పాల్గొన్నారు.

### హెచ్ఆర్సి తెలంగాణ రాష్ట్ర సీనియర్ కోఆర్డినేటర్‌గా దేపల్లె ప్రణయ్ గౌడ్ ఎంపిక

**నందిగామ, ఆగస్టు 13, ప్రభాతవార్త :** పువ్వు పుట్టగానే పరిమళించింది అన్న చందంగా.. ఉన్నత చదువుల్లో రాణించి ఇంటర్నేషనల్ మానవ హక్కుల కమిషన్, తెలంగాణ రాష్ట్ర సీనియర్ కోఆర్డినేటర్‌గా నందిగామ మండలం అంతిరెడ్డి గూడ గ్రామానికి చెందిన నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్ తనయుడు దేపల్లె ప్రణయ్ గౌడ్ ఎంపిక కావడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, నందిగామ సింగిల్ విండో చైర్మన్ కుందారం వెంకట్ రెడ్డి, చేగూరు సింగిల్ విండో చైర్మన్ పసుల బుచ్చయ్య, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కావలి కృష్ణ ,నందిగామ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచంద్రి పలువురు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు ప్రణయ్ ను అభినందించారు.

### గడ్డి మందు పిచికారి

**కుల్కచర్ల, ఆగస్టు 13, ప్రభాతవార్త :** వర్షకారం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ చంద్రభుపాల్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ పరిసర ప్రాంతంలో గడ్డి, పిచ్చి మొక్కలు పెరగడంతో పంచాయతీ సిబ్బందితో గడ్డి మందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రభుపాల్‌రావుమాట్లాడుతూ...గ్రామ ప్రజల సుచన మేరకు గ్రామంలో పరిసరాలు శుభ్రం చేయించామన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో పరిసరాలు శుభ్రం చేసుకోవాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఆంజనేయులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గడ్డి మందు పిచికారి చేయిస్తున్న సర్పంచ్